E69 NEWS

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు  జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో
పని చేయుటకు నియోజకవర్గాలవారీగా
విలేకరులు కావలెను వాట్సాప్ నెం:
9959812941-9949356387

PUBLISHED: HYDERABAD, JANGAON  సంపుటి :01  సంచిక :20  ఆదివారం 21 జూన్ 2026  ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్  పేజీలు: 04  వెల :05/-

## పోక్సో కేసులో బండి భగీరథ్‌కు బెయిల్




**న్యూస్ డెస్క్, 20 జూన్ (తెలుగు గళం):** రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ పోక్సో కేసు వ్యవహారంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో భగీరథ్?కు బెయిల్ మంజూరైంది. నెల రోజులకు పైగా జైల్లో ఉన్న భగీరథ్‌కు తాజాగా మల్కాజిగిరి కోర్టు బెయిల్ మంజూరు చేసింది.

## బ్లాక్ రెయిన్.. డేంజర్ అలర్ట్ జారీ

**న్యూస్ డెస్క్, 20 జూన్ (తెలుగు గళం):** రష్యా రాజధాని మాస్కోలో నల్లటి వర్షం కురవడం సంచలనం రేపింది. మాస్కోలోని కీలక ఆయిల్ రిఫైనరీలతో పాటు ఇతర కీలక ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని ఉక్రెయిన్ గురువారం నాడు వందలాది డ్రోన్లతో దాడికి పాల్పడింది. అయితే, ఈ దాడులు జరిగిన కొన్ని గంటల్లోనే మాస్కో పరిసర ప్రాంతాల్లో నల్లటి వర్షం కురవడం అంతర్జాతీయంగా తీవ్ర కలకలం రేపుతోంది.




దాడుల అనంతరం భయానక పరిస్థితులు

ఉక్రెయిన్ వైమానిక దాడుల తర్వాత కురుస్తున్న ఈ వర్షం సాధారణ నీటి వర్షం కాదని, ఇదొక రకమైన నల్లటి బూడిదతో కూడిన కలుషిత వర్షమని స్థానికులు చెబుతున్నారు. బ్లాక్ రెయిన్ కారణంగా ప్రజల్లో తీవ్రమైన తలనొప్పి, శ్వాసకోస సమస్యలు తలెత్తుతున్నాయి. నగరంలోని నివాస భవనాలు, రోడ్లపై ఆపి ఉంచిన వాహనాలపై నల్లటి మచ్చల దట్టంగా పేరుకుపోతున్నాయి.కాగా ఇటువంటి రసాయన బూడిద వర్షాలు పర్యావరణానికి, మానవాళికి అత్యంత ప్రమాదకరమని స్థానిక వాతావరణ శాఖ స్పష్టం చేసింది.

## చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడు..
### ప్రశంసల వర్షం కురిపించిన బాబా రాందేవ్




**న్యూస్ డెస్క్, 20 జూన్ (తెలుగు గళం):** ప్రపంచ యోగా దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఉండవల్లి గుహల వద్ద రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ వేడుకకు యోగా గురుగా పేరొందిన గురు రాందేవ్ బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీఎం చంద్రబాబు నాయుడు హాజరయ్యారు.

## సవాలే లేదు బట్టలిప్పి పరుగెత్తిస్తా
### కేటీఆర్ పై మైనంపల్లి సెన్సేషనల్ కామెంట్స్




**న్యూస్ డెస్క్, 20 జూన్ (తెలుగు గళం):** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇష్టారాజ్యంగా మాట్లాడితే కుదరదని, బిడ్డా కాస్కో.. మీకు ముందు ముందు ఇంకా చాలా సినిమా చూపిస్తామని మాజీ ఎమ్మెల్యే, మల్కాజిగిరి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్ చార్జి మైనంపల్లి హనుమంతరావు హెచ్చరించారు. కేటీఆర్ విపక్షంలోనూ అట్టర్ ఫ్లాప్ అయ్యారని, కేటీర్ ప్రతిదానికి ఎందుకు అంతలా ఉలిక్కిపడుతున్నావ్ అంటూ ప్రశ్నించారు.గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. నిన్న మల్కాజిగిరి నియోజకవర్గం పర్యటన సందర్భంగా కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు ఘాటుగా స్పందించారు.

# పవన్ కల్యాణ్ ముసుగులో తెలంగాణలో బీజేపీ ప్లాన్: మహేశ్ కుమార్ గౌడ్

**న్యూస్ డెస్క్, 20 జూన్ (తెలుగు గళం):** పవన్ కల్యాణ్ ను బూచిగా చూపెట్టి తెలంగాణలో బీజేపీ పాగా వేయాలని చూస్తోందని కానీ తెలంగాణలో బీజేపీకి స్థానం లేదని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. రాష్ట్రంలో మళ్ళీ వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. అధికారంలో శాశ్వతంగా ఉండటం కోసం ఎంత దూరమైన వెళు న్నారని బీజేపీ చెప్పిందే రాజ్యాంగం అనేలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రాంతీయ పార్టీలను చీల్చుతున్నారని ఆరోపించారు. యూనివర్సిటీల్లోకి దూరి బీజేపీ రఘుపతి రాజారాం పేరును మరిచిపోయి గాడ్సే జపం చేస్తోందని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. గాడ్సే రాజ్యం స్థాపించాలని వ్యూహంతో సొంత ఎజెండాను తీసుకొచ్చి జనాలపై రుద్దుతున్నారని దుయ్యబట్టారు.

భ్రష్టు పట్టిస్తున్నారు:

ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఉన్న ఉద్యోగాలు ఊడగొడుతున్నారని, 90 శాతం సంపద బీజేపీ నేతల అనునయుల చేతిలో ఉందన్నారు.




# రైతుకు రూ.26 వేల డిమాండ్
# సుఖీభవపై షర్మిల ఫైర్

- అన్నదాతకు పూర్తి సాయం ఇవ్వాలి
- పీఎం కిసాన్‌తో కలపొద్దన్న డిమాండ్
- ప్రతి రైతుకు రూ.20 వేలే ఇవ్వాలి
- కౌలు రైతులకూ వర్తింపజేయాలి
- 30 లక్షల రైతులు ఎందుకు దూరం?
- హామీ అమలుపై షర్మిల ప్రశ్నలు
- అన్నదాత సుఖీభవపై రాజకీయ వేడి
- రైతులకు అన్యాయం జరిగిందన్న విమర్శ
- సుఖీభవ కాదు.. దుఃఖీభవ: షర్మిల
- రాష్ట్రమే పూర్తి భారం భరించాలి
- రైతు ఖాతాల్లో రూ.7 వేల జమ
- 46.85 లక్షల రైతులకు తొలి విడత
- పథకం అమలుపై కొత్త డిమాండ్
- రైతు సంక్షేమంపై మాటల యుద్ధం



**న్యూస్ డెస్క్, 20 జూన్ (తెలుగు గళం):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకాన్ని పీఎం కిసాన్ యోజనతో కలిపి కాకుండా విడిగా అమలుచేయాలని ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. కేంద్రంతో సంబంధం లేకుండా అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేస్తామని చంద్రబాబు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని.. అధికారంలోకి వచ్చాక ఈ విషయంలో మడతపేచీ పెట్టారని షర్మిల విమర్శించారు. తామే ప్రతి రైతుకు 20 వేలు ఇస్తామని, కేంద్రం ఇచ్చేది బోనస్ అని చెప్పి.. అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చడం రైతులకు చేసిన తీరని అన్యాయమని మండిపడ్డారు. రైతులపై కూటమి ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే., పీఎం కిసాన్ సమ్మాన్ నిధి 6 వేలను జత చేయకుండా రాష్ట్ర ప్రభుత్వమే ప్రతి రైతుకి 20 వేలు ఇవ్వాలని షర్మిల డిమాండ్ చేశారు. అలాగే కౌలు రైతులకు సైతం అన్నదాత సుఖీభవ పథకాన్ని వర్తింపజేయాలని.. లేని పక్షంలో ఇచ్చిన మాట తప్పినందుకు రైతులకు క్షమాపణలు చెప్పాలని షర్మిల డిమాండ్ చేశారు.

మిగతాది 2 లో..

## తెలంగాణలో 'సర్' ప్రక్రియపై బిగ్ అప్‌డేట్
### కొత్త ఓటర్ల నమోదుపై క్లారిటీ




**న్యూస్ డెస్క్, 20 జూన్ (తెలుగు గళం):** తెలంగాణలో 'సర్' ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. కొత్త ఓటరు నమోదుకు అవకాశం లేదని వార్తలు వస్తున్నాయని, అవన్నీ అసత్యమని అన్నారు.

## రెండేళ్లు ధైర్యంగా బ్రతకండి, మళ్లీ కేసీఆర్ వస్తాడు: కేటీఆర్



## తెలంగాణలో 'సర్' ప్రక్రియపై బిగ్ అప్‌డేట్.. కొత్త ఓటర్ల నమోదుపై క్లారిటీ

మొదటి పేజీ తరువాయి




ఓటరు జాబితాలో ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా సమగ్రంగా, పారదర్శకంగా రూపొందించేందుకు చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ -2026 ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. బూత్ లెవల్ ఆఫీసర్లు, బూత్ లెవల్ ఏజెంట్లకు ఇప్పటికే పూర్తి స్థాయిలో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఇవాళ హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో చేపట్టిన 'సర్'పై వివరాలను వెల్లడించారు.

కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ఈనెల 25 నుంచి బీఎల్వోలు తమ పోలింగ్ కేంద్రాల పరిధిలో ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తారని వెల్లడించారు. జులై 25వ తేదీలోపు ఎన్యుమరేషన్ సమర్పించాలని, కొత్త ఓటర్లు తమ ఓటు హక్కును అదే ఫారంలో నమోదు చేసుకోవచ్చని క్లారిటీ ఇచ్చారు. చాలా చోట్ల 80 శాతం మ్యాపింగ్ పూర్తి చేశామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన పత్రాలను కూడా అనుమతిస్తామని, 2002లో అనుసంధానమైన వారికి ఇతర పత్రాలు అవసరం లేదని స్పష్టం చేశారు. అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా ప్రచురించే వరకు ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం అన్ని కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తుందని హామీ ఇచ్చారు. ఇప్పటికే డేటా ఎంట్రీ ఆపరేటర్లను కూడా నియమించుకుంటున్నట్లు తెలిపారు. బీఎల్‌వోలు తీసుకొచ్చే ఫామ్‌లను ముసాయిదాలో పొందుపరుస్తున్నామని వెల్లడించారు. రాజకీయ పార్టీలతో సమావేశాలు ఏర్పాటు చేయాలని అధికారులకు చెప్పామన్నారు.

## సవాలే లేదు బట్టలిప్పి పరుగెత్తిస్తా.. కేటీఆర్ పై మైనంపల్లి సెన్సేషనల్ కామెంట్స్

మొదటి పేజీ తరువాయి



ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పనులను అడ్డుకోవమే కేటీఆర్, హరీశ్ రావు పనిగా పెట్టుకున్నారని ధాన్యం సేకరణ విషయంలో ఈ ఇద్దరూ లారీలను అడ్డుకున్నారని ఆరోపించారు. అమెరికా నుంచి నేరుగా వచ్చి పదవులు అనుభవిస్తున్న కేటీఆర్ సిరిసిల్ల ఉద్యమాకారుడి నోట్లో మట్టికొట్టాడని విమర్శించారు.

సెలబ్రిటీల జీవితాలను నాశం చేశావ్:

కేటీఆర్ దండుపాళ్యం బ్యాచ్ అని మాట్లాడుతున్నాడు.. దండుపాళ్యం బ్యాచ్, స్టూవర్టుపురం దొగలకైనా మినిమం ఎథిక్స్ ఉంటాయి. మీకులా వారు సొంత చెల్లి, బావ, రాజకీయ నాయకుల ఫోన్లను ట్యాపింగ్ చేయించరని, కేటీఆర్ సెలబ్రెటీల ఫోన్లు ట్యాప్ చేసి వారి జీవితాలను నాశనం చేశాడని ఆరోపించారు. మేం రౌడీయిజం చేసేటోళ్లం కాదని రౌడీలకు బుద్ధి చెబుతూ హీరోయిజం చేసేటోళ్లం అన్నారు. సవాలే లేదని బట్టలిప్పి పరుగెత్తిస్తామన్నారు. మైనంపల్లి మాటల మనిషి కాదని చేతల మనిషి అని చెప్పారు. మల్కాజిగిరికి వస్తానంటున్నావ్ నేను సిరిసిల్లాకు రాలేనా అని ప్రశ్నించారు.

అర్ధరాత్రి పోలీసులకు దొరికిన చరిత్ర నీది:

మంత్రి హోదాలో గన్ మెన్లు ఎవరూ లేకుండా అర్ధరాత్రి ఒంటరిగా వెళ్తుండగా అప్పా జెంక్షన్?లో ముఖానికి మాస్క్ పెట్టుకుని దొరికిన ఘనత కేటీఆర్ ది అని సంచలన ఆరోపణలు చేశారు. ఈ విషయాన్ని పోలీసు డిపార్ట్ మెంట్ చర్చించుకుందన్నారు. మేము దొంగతనం చేయడం లేదని హీరోయిజం చేస్తున్నామని, ప్రజలకు సేవ చేస్తున్నామన్నారు. ప్రభుత్వంలో ఉన్నామనే ఓపికతో వెళ్తున్నామని అదే మేము తలుచుకుంటే ఒక్క రోజు కూడా నిద్రపోలేవని ఫైర్ అయ్యారు. ఇంగ్లీశ్ మాట్లాడటంలో కేటీఆర్ తనకు తానే తోపు అనుకుంటున్నాడని కానీ మెజారిటీ మంత్రుల్లో ఆయనకంటే మంచి ఇంగ్లీశ్ మాట్లాడేవారు ఉన్నారన్నారు.

## రైతుకు రూ.26 వేల డిమాండ్ సుఖీభవపై షర్మిల ఫైర్

మొదటి పేజీ తరువాయి



"అన్నదాత సుఖీభవ కాదు దుఃఖిభవ. మూడో ఏడాది సైతం రైతులకు మోసమే. పెట్టుబడి సాయాన్ని చంద్రబాబు మొక్కుబడి చేశారు. రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామని అరకొర విధింపులతో మమ అనిపిస్తున్నారు. రాష్ట్రంలో 80 లక్షల మంది అర్హత కలిగిన రైతన్నలు ఉంటే, ఈ ఏడాది సైతం ఇస్తున్నది కేవలం 46.86 లక్షల మందికే. ముచ్చటగా 30 లక్షల మంది రైతులకు మళ్లీ ఎగనామమే. తొలి ఏడాది ఎగ్గొట్టారు. రెండో సంవత్సరం రైతులకు కత్తెరేశారు. మూడో యేడు పథకాన్ని నామమాత్రం చేశారు. సుఖీభవను సగం సగం చేశారు." అని షర్మిల విమర్శించారు.

కూటమి ప్రభుత్వం పంట నష్ట పరిహారాన్ని ఎగ్గొట్టిందని.. మద్దతు ధరలకు మంగళం పాడిందని షర్మిల మండిపడ్డారు. పంట భీమాకి ధీమా లేకుండా చేశారని.. ఎరువులు ఇవ్వకుండా రైతులను అరిగోస పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్డులు ఇస్తామని చెప్పి 30 లక్షల మంది కౌలు రైతులను కకావికలం చేశారన్న షర్మిల.. కూటమి ప్రభుత్వం వ్యవసాయాన్ని దండగ చేసిందని మండిపడ్డారు.

మరోవైపు అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం కింద 2026-27 సంవత్సరానికి సంబంధించిన తొలివిడత సాయాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమచేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 46,85,838 మంది రైతుల ఖాతాల్లో రూ.3,125.47 కోట్లు జమ చేయనుంది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.2,342.92 కోట్లు కాగా... కేంద్ర ప్రభుత్వం వాటా రూ.782.55 కోట్లు. అర్హులైన రైతులు ఒక్కొక్కరికీ రూ.7 వేలు చొప్పున జమ చేయనున్నారు.

## రెండేళ్లు ధైర్యంగా బ్రతకండి, మళ్లీ కేసీఆర్ వస్తాడు: కేటీఆర్



**న్యూస్ డెస్క్, 20 జూన్ (తెలుగు గళం):** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం పొన్న గ్రామంలో పర్యటించారు. ఇటీవల ఆత్మహత్య చేసుకున్న రైతు నుగూరే పాండురంగ్ కుటుంబాన్ని బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు కురిపించారు. రైతు కుటుంబానికి ధైర్యం చెప్పండని కేసీఆర్ తమను ఇక్కడికి పంపించారని అన్నారు. రెండేళ్లు దయచేసి ధైర్యంగా బ్రతకండి, మళ్లీ కేసీఆర్ వచ్చి మిమ్మల్ని కళ్లలో పెట్టుకుని చూసుకుంటామని చెప్పమ్మన్నాడని తెలిపారు. పంట కొనలేదని రైతు విషం తాగి పడిపోతే ఒక్క అధికారి కూడా పట్టించుకోలేదని మండిపడ్డారు.

రాష్ట్రంలో ఉన్న ప్రతి రైతు పరిస్థితి ఇదేనని అన్నారు. పాండురంగ్ కుటుంబానికి కనీసం రుణమాఫీ కాలేదు, రైతుబంధు కూడా పడటం లేదని చెప్పారు. చనిపోయిన ప్రతీ రైతుకి కాంగ్రెస్ ప్రభుత్వం తప్పకుండా రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కుటుంబంలో చదువుకున్న పిల్లలు ఉంటే వాళ్ళకి తప్పకుండా ఉద్యోగం ఇవ్వాలని అన్నారు. ధాన్యం కొనక, లంచం సిస్టం పెట్టి, కనీసం మార్కెట్ యార్డులో నీళ్లు కూడా లేవని విమర్శించారు. కాబట్టి ఇవన్నీ ప్రభుత్వ హత్యలేనని ఆరోపించారు. నిజంగానే ధాన్యం కొనడంలో ప్రభుత్వం రికార్డ్ సృష్టించి ఉంటే పాండురంగ్ అనే రైతు ఎందుకు చనిపోయాడని ప్రశ్నించారు. కరోనా సమయంలో కూడా తాము 8500 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసామని, ప్రభుత్వం చెప్పే మాటలు నమ్మవద్దని అన్నారు. కావాలంటే కొనుగోలు కేంద్రాల దగ్గరికి వెళ్లి అడగాలని సూచించారు.

## పవన్ కల్యాణ్ ముసుగులో తెలంగాణలో బీజేపీ ప్లాన్: మహేశ్ కుమార్ గౌడ్

మొదటి పేజీ తరువాయి



ఆర్ఎస్ఎస్ భావాలు గల వ్యక్తులు యూనివర్సిటీల్లో దూరి వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారని హాట్ కామెంట్స్ చేశారు. బార్డర్‌లో చైనా భారత భూభాగంలోకి చొచ్చుకొస్తా ఉంటే బీజేపీ ఆ విషయం మాట్లాడటం లేదన్నారు. రాహుల్ గాంధీ లోక్ సభలో ఈ విషయాన్ని ఫోటోలతో సహా చూపించారన్నారు. గాంధీ కుటుంబం త్యాగ మూర్తుల కుటుంబం అని నెహ్రూ,గాంధీ గురించి అసత్యాలు ప్రచారం చేస్తున్నారన్నారు. దేశం కోసం ఇందిర గాంధీ, రాజీవ్ గాంధీ ప్రాణాలు అర్పించారని గుర్తు చేశారు.

ఆయన్ను ఉరి తీసినా తప్పులేదు:

మీనాక్షి నటరాజన్ నామినేషన్ విషయంలో దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని అసలు కేసు లేకుండా నామినేషన్ రిజెక్ట్ చేసిన రిటర్నింగ్ ఆఫీసర్ ను ఉరి తీసినా తప్పులేదన్నారు. జార్ఖండ్?లో అంబానీ తరపు వ్యక్తికి సరైన పత్రాలు లేకున్నా మరోసారి అవకాశం ఇచ్చారని ఆరోపించారు. దేవుడు పేరు చెప్పకుండా బీజేపీ నేతలు గెలిచే దమ్ముందా? అని ప్రశ్నించారు. ఉదయం లేస్తే దేవుడి పేరు జపం చేస్తారన్నారు. లౌకిక వాదం ఉన్న వారి ఓట్లు తొలగించే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు.

## సాయికృష్ణ మిస్సింగ్ కేసు: కృష్ణలంక శ్మశాన వాటికలోనే దహనం?

**న్యూస్ డెస్క్, 20 జూన్ (తెలుగు గళం):** రౌడీ షీటర్ సాయికృష్ణ మిస్సింగ్ కేసు దర్యాప్తులో ఏసీపీ దైవప్రసాద్ టీమ్ వేగం పెంచింది. శనివారం ఉదయం కృష్ణలంక శ్మశాన వాటిక సిబ్బంది నుంచి గత నెలాఖరులో దహనం చేసిన అనాథ శవాల వివరాలను సేకరించారు. శ్మశాన వాటిక రికార్డులను పరిశీలించి, అందులో ఉన్న వివరాలను పోలీసులు సేకరించారు. సాయికృష్ణను పోలీసులే హత్య చేసి.. మృతదేహాన్ని దహనం చేశారన్న ఆరోపణల నేపథ్యంలోనే కృష్ణలంక పోలీసులు శ్మశానవాటిలో ఎంక్వైరీ చేశారు. మే 23, 24, 25 తేదీల్లో దహనం చేసిన అనాథ శవాల వివరాలను ఆపరేటర్ రవిని అడిగి తెలుసుకున్నారు. మే 23న సాయంత్రం బస్టాండ్ వద్ద నుంచి ఒక అనాథ శవం రాగా.. 24న పోలీసుల నుంచి లేఖ వచ్చిందని, 25న ఆ డెడ్ బాడీని దహనం చేశామన్నారు. సాధారణంగా అనాథ మృతదేహాలు శ్మశాన వాటికకు వస్తే.. పోలీసుల నుంచి క్లియరెన్స్ లెటర్ వచ్చాక దానికి అంత్యక్రియలు నిర్వహిస్తామన్నారు. అయితే ఆపరేటర్ రవి చెప్పిన వివరాల ప్రకారం.. మే 24,25 తేదీల్లో ఆ శ్మశానవాటికకు నాలుగు డెడ్ బాడీలు రాగా.. ఆ నాలుగు ఎవరివన్న వివరాలు తెలియాల్సి ఉంది. ఆ నాలుగు మృతదేహాల అస్తికల ద్వారా డీఎన్ఏ పరీక్షలు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. కానీ దాదాపు మృతదేహాలను దహనం చేసి నెలరోజులు కావస్తుండటంతో.. ఈ రిపోర్టులో కచ్చితమైన రిజల్ట్ వచ్చే అవకాశాలు చాలా తక్కువే ఉంటాయి.

## పోక్సో కేసులో బండి భగీరథ్‌కు బెయిల్

మొదటి పేజీ తరువాయి



అరణ్య ఫాంహౌస్‌లో సీన్ రీకన్‌స్ట్రక్షన్: కాగా, ఓ మైనర్ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించాడన్న ఆరోపణలతో బండి బగీరథ్‌పై గత మే 8వ తేదీన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైంది. నాటకీయ పరిణామాల మధ్య ఈ కేసు విచారణాధికారి కూకట్ పల్లి డీసీపీ రితిరాజ్ ఆదేశాలతో 5 బృందాలుగా రంగంలోకి దిగిన పోలీసులు మే 16న భగీరథ్ ను అరెస్ట్ చేసి చర్లపల్లి జైలుకు రిమాండ్ ఖైదీగా తరలించారు. ఈ కేసు దర్యాప్తులో మరిన్ని కీలక ఆధారాలు సేకరించేందుకు పోలీసులు తమ కస్టడీకి అప్పగించాలని కోర్టును ఆశ్రయించగా మల్కాజిగిరి కోర్టు 3 రోజుల కస్టడీకి అనుమతి ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఆయన్ను కస్టడీకి తీసుకున్న పేట్ బషీరాబాద్ పోలీసులు చర్లపల్లి జైలు నుంచి తమ అదుపులోకి తీసుకుని మొయినాబాద్ లోని అరణ్య ఫామ్ హౌస్‌కు భగీరథ్‌ను తీసుకువెళ్లారు. అక్కడ సీన్ రీ కన్ స్ట్రక్చన్ నిర్వహించారు. ఈక్రమంలో భగీరథ్ దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్ పై విచారణ జరిపిన మల్కాజిగిరి కోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది.

## సింగరేణి సమస్యలపై కవిత సంచలన వ్యాఖ్యలు



**న్యూస్ డెస్క్, 20 జూన్ (తెలుగు గళం):** సింగరేణి సమస్యలపై తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. నేడు కవిత భూపాలపల్లి జిల్లాలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. సింగరేణి అధికారుల పీఆర్పీ చెల్లింపునకు డిప్యూటీ సీఎం లంచం అడుగుతున్నారని ఆరోపించారు. ఈ ప్రభుత్వంలో అంతలా అవినీతి పెరిగిపోయిందని అన్నారు. నిషేధిత డిటోనేటర్ల కొనుగోలు, కారుణ్య నియామకాలు, మెడికల్ బోర్డు లాంటి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఈ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వానికి జూలై 20 వరకు డెడ్ లైన్ విధించారు. ఏ మైన్‌కు వెళ్లినా రెండు ప్రధాన సమస్యలు కనిపిస్తున్నాయని అన్నారు. ప్రభుత్వం సింగరేణికి ఇవ్వాల్సిన డబ్బు ఇవ్వకపోవడం వల్ల సంస్థ నష్టాల్లో కూరుకుపోయి కార్మికులకు ఇవ్వాల్సిన పనిముట్లు ఇవ్వడంలేదన్నారు. దానివల్ల కార్మికుల భద్రతకు ముప్పు కలుగుతోందని వ్యాఖ్యానించారు. కార్మికులకు హక్కుగా ఉన్న కారుణ్య నియామకాలను ఇవ్వడంలేదని విమర్శించారు. కార్మికుల హక్కుల గురించి వెనకడుగు వేసే ప్రసక్తే లేదని హెచ్చరించారు. సింగరేణిలో కనీసం మంచినీరు, ఆక్సీజన్ ఇవ్వలేదని పరిస్థితి ఉందని వ్యాఖ్యానించారు.

## స్కిన్ కేర్ క్రీమ్స్, యాంటీబయాటిక్స్, పెయిన్ కిల్లర్స్‌పై కేంద్రం నిషేధం



**న్యూస్ డెస్క్, 20 జూన్ (తెలుగు గళం):** దేశంలో ప్రజా ఆరోగ్యాన్ని రక్షించేందుకు కేంద్రప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మానవ వినియోగం కోసం తయారు చేసే 16 రకాల ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్ మందుల తయారీ, అమ్మకాలు, పంపిణీ, సరఫరాపై తక్షణమే అమల్లోకి వచ్చేలా కేంద్రం నిషేధం విధించింది. ఈ ఔషధాల వల్ల ట్రీట్మెంట్ పరంగా ఎలాంటి ప్రయోజనాలు లేవని, వీటి వల్ల జరిగే నష్టంతో పోలిస్తే.. ప్రయోజనం ఏమాత్రం లేదని కేంద్ర ఆరోగ్యమంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. రోగుల భద్రతను పెంపొందించడం, వైద్యశాస్త్రపరంగా ధృవీకరించిన సమర్థవంతమైన మందులు మాత్రమే అందుబాటులో ఉండేలా చూడటం కోసం.. ఈ కఠినమైన చర్యలు చేపట్టినట్లు ప్రభుత్వం పేర్కొంది.

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు డ్రగ్స్ టెక్నికల్ అడ్వైజరీ బోర్డు ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ.. ఈ మందులను తయారు చేసే మిశ్రమాలపై సమగ్ర సమీక్ష నిర్వహించింది. పలు మందుల తయారీల్లో వాడే డ్రగ్ కాంబినేషన్ తప్పుగా, హానికరంగా ఉన్నట్లు తేలడంతో.. డ్రగ్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్ 1940లోని సెక్షన్ 26ఏ కింద కేంద్రప్రభుత్వం అధికారిక నోటిఫికేషన్ విడుదల చేసింది. కేంద్రం బ్యాన్ చేసిన వాటిలో స్కిన్ కేర్ క్రీమ్స్, పెయిన్ కిల్లర్స్, కడుపునొప్పి మాత్రలు, కొన్నిరకాల యాంటిబయాటిక్స్ కూడా ఉన్నాయి. ముఖ్యంగా నిషేధించిన మందుల్లో అసిటైల్ సాలిసిలిక్ యాసిడ్‌తో ఎథోహెప్టాజైన్; డిసైక్లోమైన్, పారాసిటమాల్, క్లిడినియం బ్రోమైడ్ : గ్లిక్లాజైడ్ తో కోమియం పికోలినేట్, పారాసిటమాల్ కాంబినేషన్ తో లిగ్నోకైన్ వంటివి ఉన్నాయి. వీటితో పాటు అమోక్సిసిలిన్, సెర్రాటియోపెప్టిడేస్ మరియు లాక్టోబాసిల్లస్ స్పోరోజెనెస్ వంటి యాంటీబయాటిక్ మిశ్రమాలను కూడా ప్రభుత్వం నిషేధించింది. అలాగే విటమిన్ ఈ, జోజోబా ఆయిల్, టీ ట్రీ ఆయిల్, అలోవెరా వంటి పదార్థాలతో కూడిన కొన్ని స్కిన్ కేర్ క్రీమ్స్ ను బ్యాన్డ్ లిస్టులోకి చేర్చారు. దేశవ్యాప్తంగా ఈ నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలని పేర్కొంటూ రాష్ట్ర డ్రగ్ కంట్రోలర్లు, ఎన్ఫోర్స్ మెంట్ సంస్థలకు కేంద్రం ఆదేశాలు జారీ చేసింది.

## చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడు.. ప్రశంసల వర్షం కురిపించిన బాబా రాందేవ్

మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా.. బాబా రాందేవ్.. సీఎం కు వివిధ రకాల యోగా ప్రక్రియలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు నాయుడు ఈ వయస్సులో కూడా ఎంతో ఆరోగ్యంగా ఉన్నారని కొనియాడారు. అభివృద్ధి, విజన్ కలిగిన సీఎం అంటూ.. కితాబిచ్చారు. ప్రధాని నరేంద్రమోడీ వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా.. సీఎం పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఆత్మనిర్భర్ భారత్ కోసం ప్రధాని మోదీ కృషి చేస్తోంటే.. భారత్ ను విశ్వగురుగా నిలపాలన్న ప్రధాని కృషికి చంద్రబాబు తోడయ్యారన్నారు. చంద్రబాబు తరహాలో ప్రతి సీఎం పనిచేస్తో వికసిత్ భారత్ 2047 లక్ష్యం ముందుగానే సాకారమవుతుందని బాబా రాందేవ్ ఆశించారు. దేవతల రాజధాని అమరావతి.. ఇప్పుడు యోగా రాజధాని అయిందన్నారు. చంద్రబాబు ప్రకృతి, సాంస్కృతిక, యోగా ప్రేమికుడు మాత్రమే కాదని, ఆయన సర్వజన ప్రేమికుడని ప్రశంసించారు.

సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. యోగా సాధనతో రాందేవ్ బాబా అద్భుతాలు సృష్టిస్తున్నారని కొనియాడారు. రాందేవ్ బాబా శిక్షణలో యువత చేస్తున్న యోగాసనాలు ఎంతో అద్భుతంగా ఉన్నాయని, యోగాకు మంచి గుర్తింపు తీసుకొచ్చింది రాందేవ్ బాబానే అన్నారు. ప్రస్తుత సమాజంలో యువత చాలా ఒత్తిడితో ఉందని, ఆధ్యాత్మికతతో కూడిన సాంకేతికత చాలా అవసరమని సీఎం పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా 190 దేశాలు యోగాను అనుసరిస్తున్నాయన్నారు. త్వరలో దేశానికి ఆధ్యాత్మిక హబ్ గా ఏపీ మారనుందని తెలిపారు. పర్యవరణ పరిరక్షణ, కాలుష్య నివారణ కోసం ప్రణాళికలు రూపొందిస్తున్నామని, రాష్ట్రంలో 50 శాతం పచ్చదనాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

## బ్లాక్ రెయిన్.. డేంజర్ అలర్ట్స్ జారీ

మొదటి పేజీ తరువాయి



హెచ్చరికలు జారీ

పరిస్థితి తీవ్రతను గమనించిన మాస్కో నగర అధికారులు ప్రజలకు పలు కీలక సూచనలు జారీ చేశారు. నల్లటి వర్షం కురుస్తున్నందున ప్రజలెవరూ ఇళ్ల నుంచి బయటకు రాకూడదని, తలుపులు, కిటికీలు పూర్తిగా మూసి ఉంచాలని ఆదేశించారు. ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు, ఆస్తమా వంటి ఊపిరితిత్తుల వ్యాధులు ఉన్నవారు తక్షణమే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ఎమెర్జెన్సీ అలర్ట్స్ జారీ చేశారు.

4 ఎయిర్పోర్టులు మూసివేత.. 500 పైగా విమానాలు రద్దు

రష్యాపై జరిగిన అతిపెద్ద డ్రోన్ దాడి కావడంతో మాస్కోలో తీవ్ర ఆందోళన నెలకొంది. భద్రతా కారణాల దృష్ట్యా మాస్కో నగర పరిధిలోని విమానాశ్రయాలన్నింటినీ అధికారులు తాత్కాలికంగా మూసివేశారు. ఎయిర్‌పోర్టుల మూసివేత కారణంగా అంతర్జాతీయ, దేశీయ రూట్లకు సంబంధించిన దాదాపు 500కు పైగా విమాన సర్వీసులు పూర్తిగా రద్దయినట్లు రష్యా అధికారులు అధికారికంగా ప్రకటించారు.

## దేశంలో వరుస బాంబు పేలుళ్లు.. ఏడుగురు మృతి

**న్యూస్ డెస్క్, 20 జూన్ (తెలుగు గళం):** పాకిస్తాన్‌లోని వాయవ్య ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రాంతంలో శనివారం జరిగిన రెండు వేర్వేరు బాంబు పేలుళ్ల లో కనీసం ఏడుగురు మరణించినట్లు అధికారులు ధ్రువీకరించారు. ఆఫ్ఘనిస్తాన్ సరిహద్దుకు ఆనుకుని ఉన్న ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రాంతంలోని బన్ను జిల్లాలో ఈ దారుణం చోటుచేసుకుంది. ప్రయాణికులతో వెళ్తున్న ఒక ప్రైవేట్ పికప్ ట్రక్కును లక్ష్యంగా చేసుకుని తీవ్రవాదులు మొదట రిమోట్ కంట్రోల్డ్ ఐఈడీ ద్వారా దాడికి పాల్పడ్డారని బన్ను జిల్లా పోలీసు అధికారి యాసిర్ అఫ్రిది తెలిపారు.

మొదటి పేలుడు సంభవించిన వెంటనే స్థానికులు స్పందించి, తీవ్రంగా గాయపడిన వారిని అత్యవసర చికిత్స కోసం ఒక కారులో ఆసుపత్రికి తరలిస్తుండగా.. కాసేపటికే మార్గమధ్యంలో రెండవ ఐఈడీ బాంబు పేలింది. ఈ రెండు దాడులలో మొదటి పేలుడుకు ఐదుగురు, రెండవ పేలుడుకు ఇద్దరు చొప్పున మొత్తం ఏడుగురు అమాయక పౌరులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ దాడులకు తామే బాధ్యులమని ఇప్పటివరకు ఏ ఉగ్రవాద సంస్థ అధికారికంగా ప్రకటించనప్పటికీ, గతంలో ఇలాంటి దాడులకు పాల్పడిన పాకిస్తానీ తాలిబాన్ (టెహ్రీక్-ఎ-తాలిబాన్ పాకిస్థాన్ - టీటీపీ) పైనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# అన్నారం కల్వర్ట్ నిర్మాణం కోసం తెలంగాణ రక్షణ సేన రాస్తారోకో

## ఎమ్మెల్యే హామీతో మూడు గంటల ఆందోళన విరమణ

**తెలుగు గళం న్యూస్ కరీంనగర్ / మనకోండూర్ జూన్ 20**

అన్నారం గ్రామంలోని కల్వర్ట్ నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో శనివారం భారీ రాస్తారోకో నిర్వహించారు. జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ నేతృత్వంలో జరిగిన ఈ ఆందోళన దాదాపు మూడు గంటల పాటు కొనసాగడంతో రహదారిపై వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.ఆందోళన కారణంగా రహదారికి ఇరువైపులా నాలుగు నుంచి ఐదు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు పలుమార్లు ఆందోళన విరమించాలని కోరినా, కల్వర్ట్ నిర్మాణంపై స్పష్టమైన హామీ వచ్చే వరకు వెనక్కి తగ్గేది లేదని తెలంగాణ రక్షణ సేన నాయకులు స్పష్టం చేశారు.ఈ సందర్భంగా స్థానిక సీఐ శ్రీలత సంబంధిత అధికారులతో చర్చలు జరిపినా ఫలితం లేకపోవడంతో, మనకోండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ స్పీకర్ ఫోన్ ద్వారా గుంజపడుగు హరిప్రసాద్‌తో మాట్లాడారు. వారం రోజులలో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుని, స్వయంగా కల్వర్ట్ నిర్మాణ పనులు ప్రారంభించేలా చూస్తానని హామీ ఇచ్చారు. హామీ అమలు కాకపోతే తాను కూడా ప్రజలతో కలిసి జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తానని ఎమ్మెల్యే పేర్కొనడంతో ఆందోళనకారులు రాస్తారోకోను విరమించారు.ఈ సందర్భంగా గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ, మనకోండూర్--అన్నారం-లలితాపూర్--పోచంపల్లి మార్గాల్లోని కల్వర్టులు అధ్వాన్నంగా మారి ప్రమాదాలకు కేంద్రాలుగా మారాయని అన్నారు.ముఖ్యంగా అన్నారం కల్వర్ట్ వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.అలాగే మనకోండూర్ నుంచి శ్రీనివాస్‌నగర్, జగ్గయ్యపల్లి, లింగపూర్, వెల్ది, లక్ష్మీపూర్, వేగురుపల్లి, ఊటూర్ వరకు సుమారు 20 కిలోమీటర్ల మేర రహదారి గుంతలమయంగా మారిందని, గత పదేళ్లుగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.రోడ్ల దుస్థితికి ఇసుక మాఫియా కూడా ఒక కారణమని ఆరోపించిన ఆయన, ప్రతిరోజూ వందలాది ఓవర్‌లోడ్ ట్రాక్టర్లు, లారీలు రాకపోకలు సాగించడం వల్ల రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని విమర్శించారు.అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా రోడ్ల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.ప్రభుత్వం వెంటనే మనకోండూర్ మండలంలోని రోడ్ల మరమ్మతులు చేపట్టాలని, లేకపోతే రానున్న రోజుల్లో మరింత పెద్ద ఎత్తున నిరసనలు, ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కొలిపాక గౌతమి, కుసుంబ మంజుల రెడ్డి, లింగంపల్లి నాగరాజు, మ్యాకల తిరుపతి, బుడిగె పరశురామ్ గౌడ్, అంకం శివరాణి, శ్రీరాముల రమేష్, కుతాడి శ్రీనివాస్, రంగరవేణి లక్ష్మణ్, బండమీద అంజయ్య, చంటి శ్రీనివాస్, భాషవేణి రాజేందర్, నూతి సాయి చరణ్, మడిపెల్లి వినీత్, లింగంపల్లి శ్రీనివాస్, జంగ అపర్ణ, కుతాడి రజిత, నవ్య, కొండపాక రాకేష్, కొత్తూరు రఘు, ఎండీ హుస్సేన్, గర్షగుర్తి విద్యాసాగర్, ఆసియా సుల్తానా, కొరిమి పద్మ, గాజుల నవ్య తదితరులు పాల్గొన్నారు.



# ట్రాఫిక్ మళ్లింపు వల్ల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి

## లోతు వాగు రైల్వే ఓవర్ బ్రిడ్జి మరమ్మత్తు పనులను పరిశీలించిన -- జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా తెలుగు గళం న్యూస్**



లోతు వాగు రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద జరుగుతున్న మరమ్మత్తు పనులను జిల్లా పోలీసు అధికారి (ఎస్పీ) రోహిత్ రాజు ఐపీఎస్ సంబంధిత శాఖల అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మరమ్మత్తు పనుల పురోగతి, ట్రాఫిక్ మళ్లింపు ఏర్పాట్లు, ప్రజలకు అందిస్తున్న సౌకర్యాలపై ఆయన సమీక్ష నిర్వహించారు.

ఎస్పీ మాట్లాడుతూ, వంతెన మరమ్మత్తు పనుల కారణంగా ట్రాఫిక్ మళ్లింపు చేపట్టాల్సి వస్తున్న నేపథ్యంలో స్థానిక ప్రజలు, వాహనదారులు, ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు. ప్రత్యామ్నాయ మార్గాల వద్ద స్పష్టమైన సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణకు తగిన సిబ్బందిని నియమించాలని ఆదేశించారు.

మరమ్మత్తు పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కోరారు. పనుల సమయంలో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.ప్రజలు ట్రాఫిక్ మళ్లింపులకు సహకరించి, పోలీసు శాఖ సూచించిన మార్గాలను వినియోగించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.ఈ పరిశీలనలో రోడ్లు-భవనాల శాఖ, రైల్వే శాఖ, పోలీసు శాఖకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# రేపటికి 100% పిల్లలు హాజరు కావాలి, నిర్లక్ష్యం వహించే సిబ్బంది పై వేటు

## పనికి రాని పాత భవనాలు ఉంటే కూల్చివేయండి

## అశ్రద్ధ వహించే వార్డెన్లు, ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు ఇచ్చిన ఫలితం లేదు, కఠిన కఠిన చర్యలు తప్పవు

## -- ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్

**భద్రాచలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా తెలుగు గళం న్యూస్**

గిరిజన సంక్షేమ శాఖ ఐటీడీఏ సమావేశ మందిరంలో గిరిజన సంక్షేమ శాఖలో పనిచేసే హెచ్ఎం వార్డెన్ లతో పాఠశాలల పనితీరు మరియు పాఠశాలల్లో కల్పించవలసిన మౌలిక వసతుల గురించి ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సంవత్సరం 10వ తరగతి ఫలితాలలో ఉత్తీర్ణత శాతం తగ్గిందని పిల్లలు, సైన్స్ సబ్జెక్టులలో ఫెయిల్ అయ్యారని సంబంధిత హెచ్ఎం ఉపాధ్యాయులు ఆ సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి సారించాలని అలాగే దసరా సెలవులు అయిపోయిన తర్వాత వందరోజుల యాక్షన్ ప్లాన్ తయారుచేసి అమలు చేస్తామని అందుకు హెచ్ఎంలు ప్రత్యేక దృష్టి పెట్టాలి.

విధి నిర్వహణలో అశ్రద్ధ వహించే వార్డెన్లు మరియు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు ఇచ్చిన సరైన సమాధానం రాయడం లేదని అటువంటి వారిపై కఠిన చర్యలు ఉంటాయి. ఆశ్రమ పాఠశాలలో విద్య నభ్యసిస్తున్న విద్యార్థిని విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా పాఠశాలకు ఏమైనా మరమ్మతులు ఉంటే వెంటనే చేయించుకోవాలని ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలల్లో పనికిరాని పురాతన భవనాలు ఏమైనా ఉంటే వెంటనే ఐ టి డి ఏ ఇంజనీరింగ్ అధికారులకు తెలియజేసి ఆ భవనాలు కూల్చివేయాలని అన్నారు.

ప్రస్తుతం వర్షాకాలం నడుస్తున్నందున పిల్లల ఆరోగ్య విషయంలో మాత్రం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు అన్ని డిసిజనులకు సంబంధించిన మందులు అందుబాటులో ఉంచుకోవాలని, అలాగే విద్యార్థినీ విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రతి పాఠశాలలో మెడికల్ కిట్లు సరఫరా చేసామని సంబంధిత ఏఎన్ఎంలు 24 గంటలు పిల్లలకు అందుబాటులో ఉండి వైద్య చికిత్సలు అందించాలని, ఎవరైనా పిల్లలు రెండు మూడు రోజులు అస్వస్థతతో బాధపడితే వెంటనే దగ్గరలో ఉన్న పి హెచ్ సి కి తీసుకెళ్లి వైద్యం చేయించాలి. ఈ విషయాన్ని వెంటనే పై అధికారుల దృష్టికి తీసుకొని రావాలని అన్నారు. ప్రతి ఇన్స్టిట్యూషన్లో తప్పనిసరిగా మెనూ పాటించి నాణ్యమైన భోజనం విద్యార్థిని విద్యార్థులకు అందించాలని, జిసిసి వారు సప్లై చేసే బియ్యం ఇతర సామాగ్రి నాసిరకంగా ఉంటే వెంటనే వాపస్ చేయాలని అన్నారు. 220 జిపి స్కూల్స్ మరియు 50 ఆశ్రమ పాఠశాలలో ఉద్దీపకం వర్క్ బుక్ ప్రవేశపెట్టినందున చాలా వరకు విద్యార్థిని, విద్యార్థులు బేసిక్స్ చాలా వరకు మెరుగుపడ్డట్టు గమనించానని, పిల్లలందరూ బేసిక్స్, చదవడం రాయడం ఉద్దీపకం వర్క్ బుక్ పూర్తిస్థాయిలో విద్యార్థులకు ఇంగ్లీష్ తెలుగు గణితం సబ్జెక్టులలో అన్ని పదాలు సులభంగా రాయగలుగుతున్నారని అదేవిధంగా ఈ సంవత్సరం నాలుగు ఐదు తరగతులకు ప్రత్యేకంగా ఉద్దీపకం వర్క్ బుక్ తయారు చేస్తున్నామని అలాగే 7, 8,9 విద్యార్థిని



విద్యార్థులకు కాంపిటేటివ్ పరీక్షలకు సిద్ధమయ్యేలా ప్రత్యేకంగా బుక్స్ తయారు చేస్తున్నామని అన్నారు. గత సంవత్సరం మన పాఠశాలల్లో ప్రవేశపెట్టిన కెరీర్ గైడెన్స్ పై నెలకు



రెండుసార్లు తప్పనిసరిగా మీ పాఠశాలలో ప్రత్యేక తరగతులు తీసుకోవాలని, ప్రతి టీచర్ అయిదుగురు పిల్లలను ఎంచుకొని వారికి కెరీర్ గైడెన్స్ పై ప్రతినెల రెండవ శుక్రవారం నాలుగో శుక్రవారం పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని అన్నారు. మన పాఠశాలల్లో పిడి, పీఈటీలు విద్యార్థినీ విద్యార్థులకు వివిధ క్రీడలపై మంచి తర్ఫీదు ఇచ్చి వారికి నచ్చిన క్రీడలలో పాల్గొనేలా చూడాలని అన్నారు.

పిల్లలు ఎవరు హెచ్ఎం వార్డెన్ పర్మిషన్ లేకుండా బయటకు వెళ్లకూడదని, తప్పనిసరిగా వాచ్మెన్ పి ఈ టి వార్డెన్ పిల్లల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.

# విద్యార్థుల ఆరోగ్యం పై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

## ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ

## ఉద్దీపకం బుక్ పిల్లలతో చదివించాలి

## చిన్నారులతో క్రికెట్ ఆడిన ఐ టి డి ఏ, పీ ఓ

## ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్

**దుమ్ముగూడెం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా తెలుగు గళం న్యూస్**



దుమ్ముగూడెం మండలంలోని ఆర్లగూడెం గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పాఠశాల పరిసరాలు తరగతి గదులు, డైనింగ్ హాల్ , విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనాన్ని పరిశీలించారు.

వేసవి సెలవులకు గ్రామాలకు వెళ్లి తిరిగి పాఠశాలకు వచ్చిన విద్యార్థినీ విద్యార్థులకు వాతావరణం మార్పు వలన అనారోగ్యానికి గురి అయ్యే అవకాశం ఉన్నందున తప్పనిసరిగా విద్యార్థుల యొక్క మానసిక స్థితిగతులను హెచ్ఎం మరియు ఉపాధ్యాయులు గమనించి వారికి సకాలంలో వైద్యం చేయించాలని అన్నారు. వర్షాకాలం నడుస్తున్నందున విద్యార్థుల ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని, విషపూరితమైన క్రిమి కీటకాలు సంచరిస్తూ ఉంటాయని రాత్రిపూట విద్యార్థులు ఎవరు బయటకు రాకుండా చూడాలని, ప్రతిరోజు వంటగది శుభ్రం చేసి మెనూ ప్రకారము విద్యార్థులకు వేడిగా ఉన్న ఆహారాన్ని వడ్డించాలని అన్నారు. పాఠశాల ఆవరణ శుభ్రంగా ఉండేలా చూడాలని, పాఠశాల చుట్టూ వర్షపు నీరు నిలవకుండా సైడ్ డ్రైన్లు శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు.



చిన్న ఆర్లగూడెం మరియు కొంగ వాగు గుంపు జిపిఎస్ పాఠశాలలను పరిశీలించి పిల్లల చేత ఉద్దీపకం వరకు బుక్ లోని అంశాలను చదివించి సంతృప్తి వ్యక్తం చేస్తూ ఈ సంవత్సరం ఉద్దీపకం వర్క్ బుక్ లోని అంశాలు మార్పులు చేర్పులు చేయడం జరిగిందని, సంబంధిత ఉపాధ్యాయులు ఉద్దీపకం వర్క్ బుక్ లోని పదాలను పిల్లల చేత బోర్డుపై వ్రాయించి వాటి అర్థాలను వారి చేత చెప్పించాలని అలాగే ప్రతిరోజు బోధించే పాఠ్యాంశాలతో పాటు అదనంగా విద్యార్థులకు వారికి ఇష్టమైన వ్యాసరచన, క్విజ్, నాటికలు, ఏకపాత్రాభినయానికి సంబంధించిన కలల పట్ల అవగాహన కలిగించాలని ఉపాధ్యాయులకు సూచిస్తూ వీటితోపాటు క్రీడలపై కూడా మక్కువ కలిగించాలని అన్నారు. సరదాగా పిల్లలతో క్రికెట్ ఆడి దానికి సంబంధించిన మెలకువలు చిన్నారులకు సూచించారు.

# సత్తుపల్లి సింగరేణిలో ముందస్తుగా అంతర్జాతీయ యోగా దినోత్సవ సాధన శిక్షణా కార్యక్రమాలు.



**సత్తుపల్లి,ఆర్ సి,జూన్ 20(తెలుగుగళం) న్యూస్:**

నేడు జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని సింగరేణి సంస్థ చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాల మేరకు సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ దిశానిర్దేశంలో శనివారం ముందస్తు యోగా సాధన శిక్షణా కార్యక్రమాలను అత్యంత ఘనంగా నిర్వహించారు.ఏరియాలోని ఇతర ఉన్నతాధికారులతో కలిసి మొదట జనరల్ మేనేజర్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన యోగా వేడుకలలో పాల్గొన్నారు. అనంతరం సంబంధిత ప్రాజెక్ట్ అధికారులు మరియు విభాగాల అధిపతులు తమ తమ గనులు మరియు కార్యాలయాలకు చేరుకుని, సిబ్బందితో కలిసి ప్రత్యేక యోగా సాధన శిక్షణలను స్వయంగా దగ్గరుండి నిర్వహించారు. ఇందులో భాగంగా జెవీఆర్ ఓపెన్ కాస్ట్, కిష్టారం ఓపెన్ కాస్ట్ గనులతో పాటు జెవీఆర్ సీహెచ్‌పీ మరియు అన్ని విభాగాల ఆవరణలలో సామూహిక యోగా సాధన కార్యక్రమాలు జరిగాయి.ఈ సందర్భంగా ఏరియా జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ మాట్లాడుతూ సీఅండ్ఎండీ ఆదేశాల ప్రకారం ఆదివారం జరగబోయే అంతర్జాతీయ యోగా దినోత్సవానికి సన్నద్ధతగా ఈ రోజు ఏరియాలోని ప్రధాన గనులు మరియు జీఎం కార్యాలయ పరిధిలోని అన్ని విభాగాలలో ముందస్తు సాధన శిక్షణలను విజయవంతంగా నిర్వహించాము. నిరంతర పని ఒత్తిడిలో ఉండే సింగరేణి కార్మికులకు, ఉద్యోగులకు మానసిక ప్రశాంతత, శారీరక దృఢత్వం ఎంతో అవసరం. ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో యోగాను ఒక భాగం చేసుకోవాలి," అని పిలుపునిచ్చారు.

ఈ ముందస్తు యోగా సాధన కార్యక్రమాలలో ఎస్ఓ టు జీఎం బొల్లం శ్రీనివాసు, ఏరియా ఇంజనీర్ కె. సోమశేఖర రావు, జెవీఆర్ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ అధికారి ఎన్.వి.ఆర్. ప్రహ్లాద్, కిష్టారం ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ అధికారి ఎ.ఎల్.ఎస్.వి. సునీల్ వర్మ, జెవీఆర్ సీహెచ్‌పీ ప్రాజెక్ట్ అధికారి పి. సాయినాథ్, జెవీఆర్ డిస్పెన్సరీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ బి. నరసింహారావు లతో పాటు వివిధ విభాగాల అధిపతులు, వైద్య సిబ్బంది, సింగరేణి రక్షణ సిబ్బంది, కార్మిక సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

# ఈ -కేవైసి పేరుతో గ్యాస్ ఏజెన్సీ దోపిడీ

## డెలివరీ పేరుతో వినియోగదారులను దోచేస్తున్న గ్యాస్ ఏజెన్సీ

## -- సామాజిక కార్యకర్త, న్యాయవాది కర్నె రవి

**మణుగూరు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా తెలుగు గళం న్యూస్**




పినపాక నియోజకవర్గం లోని హెచ్ పీ, భారత్ గ్యాస్, అలాగే జిసిసి ఆధ్వర్యంలో నడిచే ఇండియన్ గ్యాస్ ఏజెన్సీలలో నిర్వాహకులు డోర్ డెలివరీ పేరుతో వినియోగదారుల నుండి ముక్క పిండి అక్రమ వసూళ్లకు పాల్పడు తున్నారని, అలాగే అశ్వాపురం మండలం లోని అభిరామ్ గ్యాస్ ఏజెన్సీలో ఈ -కేవైసి పేరుతో వినియోగదారుల నుంచి అక్రమం గా డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరో పణలపై సంబంధిత అధికారులు వెంటనే విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త, న్యాయవాది, కర్నె రవి డిమాండ్ చేశారు. ఆయన కార్యాలయంలో ఏర్పా టు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడతు ప్రభుత్వం నిర్దేశిత ధరలకు గ్యాస్ కొనుగోలు చేస్తున్న వినియోగదా రులకు డెలివరీ పేరుతో ఒక్కో గ్యాస్ పై రూ. 50 నుండి 100 రూపాయలు అదనపు డబ్బులను వసూలు చేయడం, అభి రామ్ హెచ్.పీ గ్యాస్ ఏజెన్సీ లో గ్యాస్ కనెక్షన్‌కు సంబంధించిన ఈ -కేవైసి ప్రక్రియ నిర్వహిం చేందుకు వినియోగదారుల నుంచి 200 రూపాయలు అదనపు చార్జీలు వసూలు చేయడం సరైన విధానం కాదని ఆయన పేర్కొన్నారు. అలాగే ఈ -కేవైసి పూర్తయిన తర్వాత అవసరం లేకపోయినా గ్యాస్ పైపులను వినియోగ దారులకు అందిస్తూ అదనపు భారం




మోపుతున్నారని ఆరో పించారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు పారదర్శకంగా అందించాల్సిన సమయం లో కొందరు నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడటంతో సామాన్య మధ్య తరగతి ప్రజలు అదనపు భారంతో ఆర్థికంగా నష్టపోతారని కర్నె రవి అన్నా రు. ఈ అంశంపై పౌర సరఫరాల శాఖ, ఆయిల్ కంపెనీల ఉన్నతాధికారులు స్పందించి వాస్తవాలను వెలికి తీసి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినియోగదారుల హక్కులను కాపాడేం దుకు అధికారులు ప్రత్యేక దృష్టి



సారించి, గ్యాస్ సిలిండర్ పై అదనపు వసూళ్లు, ఈ -కేవైసి పేరుతో జరిగే అక్రమ వసూళ్లను అరికట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అంతేగాక కొందరు గ్యాస్ నిర్వాహకులు బ్లాకు మార్కెట్ లో ఒక్కో సిలిండర్ 15 వందల నుండి 2000 రూపాయలకు విక్ర యిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని అక్రమ వసూళ్లు చేయడం సహించరాని ది. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవా లని పేర్కొన్నారు. ఇప్పటికైనా సివిల్ సప్లై డిటి తక్షణమే స్పందించి గ్యాస్ ఏజెన్సీ లలో తనిఖీలు నిర్వహించాలని, ప్రజలకు అందుబాటులో గ్యాస్ ధరలను ఉంచా లన్నారు. లేనిచో జిల్లా ఉన్నతాధికారు లకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

# సత్తుపల్లి త్రివేణి స్కూల్‌లో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు



**సత్తుపల్లి,ఆర్ సి,జూన్ 20 ( తెలుగుగళం )న్యూస్ :** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని సత్తుపల్లిలోని త్రివేణి స్కూల్‌లో శనివారం ఘనంగా యోగా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తెలుపు రంగు యూనిఫామ్‌లలో పాల్గొని వివిధ యోగా ఆసనాలను క్రమశిక్షణతో ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు.

ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఎం. సరిత మాట్లాడుతూ, "యోగా అనేది భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన కానుక. యోగాను నిత్య జీవితంలో భాగంగా చేసుకోవడం ద్వారా విద్యార్థులు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవచ్చు" అని పేర్కొన్నారు.

పాఠశాల పీఈటీ పాపారావు యోగాలోని వివిధ ఆసనాలను విద్యార్థులకు ప్రదర్శిస్తూ, వాటిని సరైన విధానంలో చేయాల్సిన పద్ధతులను వివరించారు. యోగా సాధన వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను ఆయన వివరంగా తెలిపారు.

ఈ కార్యక్రమంలో: క్యాంపస్ ఇన్‌చార్జ్ వంశీ,అకాడెమిక్ ఇన్‌చార్జ్ పవన్,త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ జి. వీరేంద్ర చౌదరి, సీఆర్వో మురళీకృష్ణ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, యోగా యొక్క ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థుల్లో ఆరోగ్య అవగాహన, క్రమశిక్షణ, యోగాపై ఆసక్తిని పెంపొందించడంలో ఈ కార్యక్రమం విజయవంతమైందని పాఠశాల యాజమాన్యం వెల్లడించింది.

## యోగాతో ఆరోగ్యం -- ఆరోగ్యంతో ఆనందం

### అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విశ్వశాంతి విద్యాలయంలో యోగా అవగాహన కార్యక్రమం



సత్తుపల్లి,ఆర్ సి,జూన్ 20 ( తెలుగుగళం ) న్యూస్ : నేటి అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని పట్టణంలోని విశ్వశాంతి విద్యాలయంలో శనివారం యోగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ యోగా గురువు రాజరత్నాచారి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు యోగా ప్రాముఖ్యతను వివరించారు. యోగా అనేది భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప వరమని, శరీరం–మనస్సు–ఆత్మల సమతుల్యతకు యోగాభ్యాసం ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. నేటి వేగవంతమైన జీవనశైలిలో విద్యార్థులు ఎదుర్కొంటున్న మానసిక ఒత్తిడిని తగ్గించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. యోగాను నిత్యం సాధన చేయడం ద్వారా శారీరక ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని వివరించారు. ప్రతి విద్యార్థి రోజూ కనీసం 20 నిమిషాల పాటు యోగాభ్యాసం చేయాలని సూచిస్తూ, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగా ఒక శక్తివంతమైన సాధనమని అన్నారు. అలాగే విశ్వశాంతి సాధనలోనూ యోగా ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని తెలిపారు. అనంతరం వివిధ యోగా ఆసనాలను ప్రదర్శించి విద్యార్థులకు ప్రాక్టికల్ శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బాసర ఐఐటీలో సీటు సాధించిన విద్యార్థిని అభినందించిన ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి



సత్తుపల్లి,ఆర్ సి,జూన్ 20 ( తెలుగుగళం ) న్యూస్: సత్తుపల్లి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం సత్తుపల్లి టాలెంట్ స్కూల్ విద్యార్థి నారపోగు రామ్ చరణ్ తేజ్ బాసర ఐఐటీలో సీటు సాధించిన సందర్భంగా ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సత్తుపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, మున్సిపల్ చైర్మన్ రిహానా బేగం విద్యార్థిని ఘనంగా అభినందించి, అతని భవిష్యత్ విద్యాభ్యాసంలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అలాగే విద్యార్థి విజయంలో కీలక పాత్ర పోషించిన టాలెంట్ స్కూల్ ప్రిన్సిపాల్ పులి శ్రీనివాస్ రావుతో పాటు పాఠశాల ఉపాధ్యాయ సిబ్బందిని కూడా అభినందించారు. కృషి, పట్టుదలతో ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని ఈ విజయం విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థి తల్లిదండ్రులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య కార్పొరేట్ పాఠశాల బుక్స్ గోదాంను సీజ్ చేసిన విద్యాశాఖ అధికారులు"





సత్తుపల్లి,ఆర్ సి,జూన్20 (తెలుగుగళం) న్యూస్: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంలు మరియు ఇతర స్టేషనరీ సామగ్రిని విక్రయించేందుకు ప్రత్యేకంగా గోదాంను ఏర్పాటు చేసిన సత్తుపల్లి నియోజకవర్గంలోని శ్రీ చైతన్య కార్పొరేట్ పాఠశాల ఎదుట విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

విద్యార్థి సంఘాల ఫిర్యాదుపై స్పందించిన సత్తుపల్లి మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) రాజేశ్వరరావు పాఠశాలను తనిఖీ చేసి, అక్రమంగా నిర్వహిస్తున్న బుక్స్ గోదాంను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎ జిల్లా కార్యదర్శి జమ్మి అశోక్, జార్జిరెడ్డి పి డి ఎస్ యూ జిల్లా అధ్యక్షులు ఎస్. మందా సురేష్, బి ఎస్ ఎఫ్ ఐ జిల్లా అధ్యక్షులు దాసరి రాజశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ విద్యాసంస్థలే విద్యార్థులకు బలవంతంగా పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాంలు, స్టేషనరీ సామగ్రి విక్రయించడం అనైతిక చర్య అని విమర్శించారు. జిల్లా వ్యాప్తంగా అనేక ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యార్థులను దోపిడీ చేస్తూ పుస్తకాలు, యూనిఫాంలు మరియు ఇతర విద్యా సామగ్రిని అధిక ధరలకు విక్రయిస్తున్నాయని వారు ఆరోపించారు. ఇటువంటి విద్యాసంస్థలపై విద్యాశాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అదేవిధంగా విద్యా హక్కు చట్టం ప్రభుత్వ మార్గదర్శకాలను ఉల్లంఘించే విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో: బిఎస్ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి చిలుముల అజయ్, ఎస్ ఎఫ్ ఐ విద్యార్థి సంఘ నాయకులు బెజవాడ సాయి, బాలాజీ,రాము తదితరులు పాల్గొన్నారు.

## సూర్య నగర్ సెయింట్ అల్ఫాహోన్స్ హై స్కూల్‌లో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు



మేడ్చల్ మల్కాజిగిరి, అల్వాల్ – సూర్యనగర్,జూన్ 20 ( తెలుగుగళం )న్యూస్ : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ సందర్భంగా హెచ్ఎం చంద్రమోహన్ గారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని, దానివల్ల శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత లభిస్తాయని ఈ ప్రసంగం ద్వారా అవగాహన కల్పించడం జరిగినది

# యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

### ప్రధానోపాధ్యాయులు మంద జయ,
### యోగా ట్రైనర్ రాయిపెల్లి యాకయ్య





తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్ జిల్లా

ప్రస్తుత పరిస్థితులలో యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని జడ్పిహెచ్ఎస్ చిల్లంచర్ల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంద జయ,యోగా ట్రైనర్ రాయపల్లి యాకయ్య అన్నారు యోగ అంటే మనసును శరీరాన్ని కలపడం అని అదేవిధంగా యోగా అంటే జీవనశైలిలో మార్పు చేసుకోవడం అని ప్రతి మనిషి యొక్క ఆలోచనపైనే వారి యొక్క జీవన విధానం ఆధారపడి ఉంటుందని సృష్టి ఎప్పుడూ మారదని ప్రతి మనిషి తను చూసేటువంటి దృష్టి కోణాన్ని మార్చుకోవాలని ఇప్పుడున్న పరిస్థితులలో ప్రతి మనిషి తన దైనందిన జీవితంలో డబ్బే పరమావధిగా జీవించడం జరుగుతుంది అలా కాకుండా ఆరోగ్యం పరమావధిగా జీవించాలని ఆరోగ్యంగా ఉన్నప్పుడే అన్నీ చేయడం సాధ్యమవుతుందని అన్నారు ప్రత్యేకంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజున పాఠశాలలో యోగా ట్రైనర్ రాయిపెల్లి యాకయ్య ఆధ్వర్యంలో పిల్లలకు యోగ యొక్క విశిష్టతను ఆసనాల యొక్క ప్రాముఖ్యతను వివరించడం జరిగింది యాకయ్య మాట్లాడుతూ యోగా అనేటువంటిది అష్టాంగ నియమాలను కలిగి ఉంటుందని ఇందులో చివరిది సమాధి అని ఆసనాలు యోగాలో ఒక భాగం మాత్రమే అని ప్రతిరోజు పెద్దవాళ్లు చిన్నవాళ్లు ఎక్సర్సైజులు ఆసనాలు వ్యాయామం నడక ఇలాంటివి చేస్తూ చివరగా సమాధి అభ్యాసం చేసినట్లయితే మనసు ప్రశాంతంగా ఉండి అనారోగ్యాలు దరి చేరవని సంపూర్ణవంతమైన ఆరోగ్యవంతులుగా జీవిస్తూ ఆనందంగా సంతోషంగా అవకాశంలిఉంటుందని అదేవిధంగా పిల్లలు ప్రతిరోజు యోగా,ధ్యానం చేయడం వల్ల ధారణ శక్తి పెరిగి ఏకాగ్రతతో మంచి జ్ఞానవంతులుగా ఎదిగే అవకాశం ఉంటుందని అన్నారు,ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ లోనే వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సంపత్,హీరాలాల్ ఉపాధ్యాయులు కవిత, శ్రీనివాస్,భాస్కర్, రహీమున్నీసా,సాంసాన్ సుధాకర్ శ్రీకాంత్ సి ఆర్ పి సత్యశ్రీనివాస్ గౌడ్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

## అమ్మ మాట--అంగన్వాడి బాటలో అక్షరాభ్యాసాలు

### ఐదేళ్లు నిండిన చిన్నారులకు విద్యారంభ ధ్రువపత్రాల పంపిణీ





వేంసూరు, జూన్ 20 (తెలుగుగళం): చిన్నారుల విద్యాభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "అమ్మ మాట--అంగన్వాడి బాట" కార్యక్రమంలో భాగంగా చౌడవరం గ్రామపంచాయతీలో శనివారం అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వేంసూరు సెక్టార్ సూపర్వైజర్ కమల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి విద్యా ప్రస్థానానికి శ్రీకారం చుట్టారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించి అంగన్వాడీ కేంద్రాల ప్రాధాన్యత, బాలల విద్య, ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే ఐదేళ్లు పూర్తిచేసుకున్న చిన్నారులకు విద్యారంభ ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నల్లిబోయిన అంజమ్మ మాట్లాడుతూ చిన్నారుల భవిష్యత్‌కు పునాది అంగన్వాడీ కేంద్రాలేనని, తల్లిదండ్రులు పిల్లలను క్రమం తప్పకుండా కేంద్రాలకు పంపించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, చిన్నారుల తల్లులు, అంగన్వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. చిన్నారుల ఉత్సాహభరిత పాల్గొనడం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో: అంగన్వాడీ టీచర్స్ బానోతు లక్ష్మీ, గూగులోతు లక్ష్మి, పార్వతి, కళావతి, లబ్ధిదారులు, చిన్నారులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ లో రోడ్డు కు ట్రంప్ పేరు వద్దంటూ సిఐటియు నిరసన ప్రదర్శన"



ఖమ్మం, జూన్20 (తెలుగు గళం) న్యూస్:తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ నగరంలో అమెరికా కాన్సలేట్ కార్యాలయం రోడ్డు కు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేరు పెట్టాలని చేసిన ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు పెరుమాళ్ళపల్లి మోహన్ రావు డిమాండ్ చేశారు. సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు, ఖమ్మం రూరల్ మండలంలోని వరంగల్ క్రాస్ రోడ్డులో శనివారం సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పెరుమాళ్ళ పల్లి మోహన్ రావు మాట్లాడుతూ, ప్రపంచ పోలీసు గా వ్యవహరిస్తూ తనకు తన దేశానికి ఎవ్వరూ అడ్డు చెప్పితే ఆదేశం మీద యుద్ధం చేసే దుర్మార్గమైన ఆలోచన కలిగిన వ్యక్తి ట్రంప్ అని ఆయన లాంటి వారి పేరు హైదరాబాద్ లో ఒక రోడ్డు కు పెట్టాలనే ఆలోచన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రావటం, దురదృష్టకరం అన్నారు,ఆ ఆలోచన వెంటనే విరమించుకోవాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా కార్మిక వర్గానికి ఐక్యంగా చేసి ఉద్యమిస్థామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో: ఆల్ ఆటోమొబైల్ షోరూమ్స్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు జిల్లా అధ్యక్షులు భీమనపల్లి నాగ శ్రీనివాసరావు,కోశాధికారి గెర్రెపల్లి ప్రవీణ్,ఉపాధ్యక్షులు బి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు జక్కుల ప్రకాష్, సహాయ కార్యదర్శి గుగ్గిళ్ళ వీరబాబు,మద్దా గోవర్ధన్ రావు,వడ్లమూడి శ్రీకాంత్, ధరవాత్తు నరేష్,తీగల గోపినాథ్,యామిని రాంబాబు,కుంచెం లక్ష్మి నారాయణ, నాలి నాగరాజు, యడవల్లి రాంబాబు,వసంత బాబు తదితరులు పాల్గొన్నారు.

## పర్వతగిరి మండలంలో మృతుల కుటుంబాలను పరామర్శించిన మాజీ జడ్పీటీసీ మేడిశెట్టి రాములు



తెలుగు గళం న్యూస్,పర్వతగిరి, జూన్/20

పర్వతగిరి మండలంలోని పలు గ్రామాల్లో మృతి చెందిన వారి కుటుంబాలను మాజీ జడ్పీటీసీ, సీనియర్ రాజకీయ నాయకులు మేడిశెట్టి రాములు పరామర్శించి ఓదార్చారు. మండలంలోని అన్నారం షరీఫ్ గ్రామానికి చెందిన సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు చాకలి రాములు ఇటీవల మృతి చెందారు. ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం పర్వతగిరి గ్రామంలో మృతి చెందిన అంకతి మల్లేశం భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. దౌలత్‌నగర్‌లో ఇటీవల తాటిచెట్టు పైనుంచి పడి మరణించిన దొనికెన శ్రీనివాస్ కుటుంబ సభ్యులను, పర్వతగిరిలో ఇటీవలే మరణించిన మంచాల రామకృష్ణ కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే జంగ ఎల్లమ్మ దశదినకర్మలో పాల్గొని నివాళులర్పించారు. మృతుల కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని,అన్ని విధాలుగా అండగా ఉంటానని రాములు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ వైస్ చైర్మన్ సందెల నవీన్,మాజీ వైస్ ఎంపీపీ గంగాధర్ రావు, మాజీ జడ్పీటీసీ సభ్యులు మహ్మద్ సర్వర్, మాజీ ఉపసర్పంచ్ రంగు జనార్దన్, ఆదొండ బిక్షపతి,మాజీ వార్డు సభ్యులు కంటెం ఏకాంతం, నాయకులు దొనికి కొమురయ్య, కంటెం సుధాకర్,కొండా వెంకన్న, రాంమూర్తి, కుమార్,ప్రేమ్ చంద్ తదితరులు పాల్గొన్నారు.

## పలు ఫర్టిలైజర్ షాప్ ను తనిఖీ చేసిన జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

### జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ్ చంద్ర

తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్ జిల్లా.





టాస్క్ ఫోర్స్ లో భాగంగా వ్యవసాయ శాఖ నిర్వహించిన టువంటి తనిఖీ స్థానిక వ్యవసాయ శాఖ అధికారి వీరా సింగ్ ఆధ్వర్యంలో జరిగిన తనిఖీలలో భాగంగా ఈరోజు జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర,మరిపెడ మండలంలోని శ్రీ సీతారామ ఏజెన్సీస్ మరియు సూర్య తేజ ఏజెన్సీస్ ను సందర్శించడం జరిగింది , ఇందులో భాగంగా స్టాక్ రిజిస్టర్లు మెయింటైన్ చేయని డీలర్లకు హెచ్చరికలు జారీ చేసారు,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులను ఉద్దేశిస్తూ వరి పంటకు బోనస్ లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నటువంటి ఏడు సన్న రకాలను రైతులు సాగు చేయాలని, తద్వారా రైతులు క్వింటాల్ కి 500 రూపాయలు బోనస్ పొందడానికి అవకాశం ఉంటుందని తెలియజేశారు. విత్తన డీలర్ల దగ్గర రైతులు కొనుగోలు చేసిన విత్తనాలకు తప్పనిసరిగా విత్తన రసీదు తీసుకోవాలని సూచించారు,నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలని, అమాయక రైతులను ఆసరాగా చేసుకుని నకిలీ విత్తనాలు అమ్మేటువంటి వారి యొక్క వివరాలు సంబంధిత వ్యవసాయ అధికారులకు తెలియజేయాలని కోరడం జరిగింది. నకిలీ విత్తనాలు అమ్మిన కొన్న కఠినమైన చర్యలు ఉంటాయని తెలియజేయడం జరిగింది.

ఈ యొక్క కార్యక్రమంలో ఏడిఏ శ్రీదేవి,మండల వ్యవసాయ అధికారి వీరసింగ్, ఫెర్టిలైజర్ షాప్ నాయకులు కాలం శ్రీనివాస్ రెడ్డి,జడల సురేందర్ గౌడ్, ప్రసాద్,రామారావు తదితరులు పాల్గొన్నారు.

## హనీ 7 రెస్టారెంట్ అధినేతను పరామర్శించిన ప్రభుత్వ విప్

తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్ జిల్లా.



మరిపెడ పట్టణానికి చెందిన హనీ 7 రెస్టారెంట్ అధినేత దుబ్బాక నరేష్ రెడ్డి తండ్రి, ప్రముఖ వ్యాపారవేత్త దుబ్బాక లక్ష్మారెడ్డి నిన్న శుక్రవారం గుండెపోటుతో మరణించగా విషయం తెలుసుకున్న డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోతు రాంచంద్రు నాయక్ శనివారం వారి చిత్రపటానికి నివాళి అర్పించి నరేష్ రెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించారు. వారి వెంట జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వీసారపు శ్రీపాల్ రెడ్డి,మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు మెరుగు రాము, జాటోతు సురేష్, పానుగోతు రాములు, తిరుపతి. కాంగ్రెస్ పార్టీ నాయకులు టౌన్ ప్రెసిడెంట్ షేక్ తాజోద్దీన్,మాజీ సర్పంచ్ పానుగోతు రాంలాల్,కుడితి నర్సింహారెడ్డి,గుండగాని వేణు,షేక్ అఫ్జల్,బోడ రవి,ప్రమోద్,సర్వర్ పాషా,లచ్చిరామ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయండి

### మెంచు అశోక్ కుమార్ గౌడ్ జేపీసీ కన్వీనర్

తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్ జిల్లా.



ఈనెల 21 వ తేదీన మహబూబాబాద్ పట్టణంలోని ఆర్తి గార్డెన్స్ లో డివిజన్ స్థాయిలో జరుగనున్న తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలిని మరిపెడ జేపీసీ కన్వీనర్ మెంచు అశోక్ కుమార్ గౌడ్,పిలుపునిచ్చారు. శనివారం మరిపెడ మండల కేంద్రంలోని ఉద్యమకారుల మండల బాధ్యులు బోడ రవి నాయక్, ఎండి అప్సర్, బోడ రమేష్ నాయక్,వెంకట్ రెడ్డి, రాజేందర్,బోడ సురేష్, సలీమ్, జరిగిన సమావేశంలో హాజరయ్యి తెలంగాణ అమరవీరుల బలిదానాలు స్మరిస్తూ నివాళులు అర్పించారు.

ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో జరుగనున్న ఆత్మీయ సమావేశంలో ఉద్యమకారుల అభిప్రాయాలు తెలుసు కోవడానికి తెలంగాణ జేపీసీ చైర్మన్ కోదండరాం, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ వస్తున్నారని, మరిపెడ మండలంలోని నిఖార్సైన తెలంగాణ ఉద్యమకారులు అందరూ హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు..

# సన్న వడ్లన్నింటికీ బోనస్ ఇవ్వాలి సర్పంచ్ ఏర్పుల శ్రీనివాస్ డిమాండ్

### రకాలకే బోనస్ ఇవ్వడం సిగ్గుచేటు: కాంగ్రెస్ సర్కారుపై సోమారం సర్పంచ్ ఫైర్
### 33 రకాలకు బోనస్ అని మాట తప్పిన రేవంత్ సర్కార్:సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్



తెలుగు గళం న్యూస్,పర్వతగిరి, జూన్/20

ఎండనకా వాననకా, రాత్రనకా పగలనకా ఆరుగాలం కష్టపడి రైతులు పండించే అన్ని రకాల సన్నధాన్యానికి ప్రభుత్వం బోనస్ చెల్లించాలని సోమారం సర్పంచ్ ఏర్పుల శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి సర్పంచ్ మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 33 రకాల సన్నధాన్యానికి బోనస్ చెల్లిస్తామని చెప్పి,మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు కేవలం ఏడు రకాల వరి ధాన్యానికే బోనస్ చెల్లిస్తామనడం సిగ్గుచేటు అని విమర్శించారు. ప్రభుత్వం ప్రకటించిన ఏడు రకాలు – బీపీటీ–5204 (సాంబమసూరి),ఆర్ఎన్ఆర్–15048 (తెలంగాణ సోనా), హెచ్ఎంటీ సోనా, జై శ్రీరామ్, కేఎన్ఎం–1638 (కూనారం సన్నలు), డబ్ల్యూజీఎల్–44 (సిద్ధి), కేఎన్ఎం–7715–ఈ రకాలకే కాకుండా మిగిలిన అన్ని రకాల సన్నధాన్యానికీ బోనస్ చెల్లించే విధంగా తక్షణమే జీవో విడుదల చేయాలని ప్రజల, రైతుల పక్షాన ఆయన డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రభుత్వంలో అన్ని రకాల సన్నధాన్యానికి బోనస్ ఇస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఎందుకు ఇవ్వలేకపోతున్నారని ప్రభుత్వాన్ని పత్రికాముఖంగా ప్రశ్నిస్తున్నట్లు సర్పంచ్ ఏర్పుల శ్రీనివాస్ తెలిపారు.


Printed and Published by BARISHETTI SRIKANTH on be half Of Telugu galam
H.No: H.NO: 8-2-293/82/BJR/127, BJR NAGAR, FILM NAGAR, GREATER HYDERABAD(M.CORP), PO:JUBILEE HILLS, HYDERABAD, TELANGANA - 500033.
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.